

కాటన్ దొర విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని చిన కోరుమిల్లి గోదావరి నదీ తీరం ఏటుగట్టుపై రిటైర్డ్ హెచ్ఎం చిక్కం సూర్యనారాయణ ఏర్పాటు చేసిన కాటన్ దొర విగ్రహాన్ని ఎంఎల్ఎ, రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు కాటన్ దొర అని కొనియాడారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విశ్రాంత హెచ్ఎం సూర్యనారాయణను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్య నారాయణ, జనసేన మండల అధ్యక్షుడు తుట్టుపు నాగరాజు, నాయకులు కొండిశెట్టి నాగేశ్వరరావు, మోటుపల్లి బాపిరాజు, వెలుగుబంటి యేసుదాసు, వెలుగుబంటి వీరభద్రం పాల్గొన్నారు.

రేషన్ షాపుల పునఃప్రారంభానికి ఏర్పాట్లు

-జూన్ 1 నుంచి పంపిణీకి సిద్ధం చేయాలి

-సమీక్షా సమావేశంలో జెసి ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో అత్యంత పారదర్శకంగా రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పున్ణప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.నిషాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎల్‌పిజి, రేషన్ డీలర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీలర్ల ద్వారా రేషన్ సరఫరా, దీపం-2 సిలిండర్ ఖరీదు ముందస్తుగానే ఆన్‌లైన్‌లో లబ్ధిదారులు ఖాతాకు జమ చేయడం, డెలివరీ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. జూన్ ఒకటో తేదీన పండగ వాతావరణంలో రేషన్ షాపులను పున్ణప్రారంభించాలన్నారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ అందరి సమన్వయంతో ఆదర్శంగా పని చేస్తుందన్నారు. రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని డీలర్లు ఒక సేవా కార్యక్రమంగా భావించి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఎల్‌పిజి డీలర్లు డెలివరీ సిబ్బంది ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు నిర్వహించి రసీదులు జారీ చేస్తూ ఆ మేరకే ఛార్జీలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లబ్ధిదారుల నుంచి అదనపు ఛార్జీలు, అంతస్తులు పేరిట వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం ఆర్‌టిజిఎస్, ఐవిఆర్ఎస్ వ్యవస్థల ద్వారా ప్రజాభిప్రాయాల సేకరణలో అధిక ధరలు పేరిట అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం ద్వారా కొత్త రేషన్ కార్డులు జారీ, మార్పులు చేర్పులు సంబంధించి విధి విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌పిజి సిలిండర్ ధరలు ముందుగానే లబ్ధిదారుల ఖాతాకు ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రక్రియలో సమస్యలు ఉత్పన్నమైనట్లయితే సిబ్బంది పూర్తిగా సహకరిస్తారన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడి వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, పంపిణీలో డీలర్లు అత్యంత పారదర్శకత పాటించాలని సూచించారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిఎస్ఒ ఉదయభాస్కర్ మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ ప్రక్రియలో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసేందుకు పూర్తి స్థాయిలో ఈ నెలాఖరు నాటికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రేషన్ దుకాణాల ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థపై కార్డుదారులకు అవగాహన కల్పించాలన్నారు. రేషన్ దుకాణాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు పౌర సేవలు అందించాలన్నారు. ప్రజాప్రతినిధులు రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఇందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన విధంగా స్టాక్‌ను నిర్వహించడం, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడటం, సరైన తూనికలు కొలతలతో కచ్చితత్వంతో నాణ్యమైన సరుకులు పంపిణీ చేయడం, కార్డుదారునికి ఈ-పోస్ రిసీట్ అందించడం వంటివి చేయాలన్నారు. ధరలు, స్టాక్ బోర్డులను చౌకధరల దుకాణాల ముందుభాగంలో స్పష్టంగా కనబడేలా ప్రదర్శించాలన్నారు. ఏదైనా సాంకేతిక సహకారం కావాలంటే బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ-పోస్, వెయింగ్ మెషీన్ల రిపేర్లకు సంబంధించి సర్వీసు క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సేవల విషయంలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా చర్యలు తీసుకుంటోందని, నేరుగా రేషన్ కార్డుదారుల నుంచి అభిప్రాయాలు తీలుసుకుని, ఎప్పటికప్పుడు విశ్లేషించడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో నిబద్ధతతో రేషన్ దుకాణాలు కార్డు దారులకు సేవలందించాలని, లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేసేలా సరుకులు పంపిణీ విధానాన్ని అమలుచేయాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన రేషన్ డీలర్లపై ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.బాలసరస్వతి, ఎల్‌పిజి డీలర్ల ప్రతినిధి త్రినాథ్, రేషన్ డీలర్ల ప్రతినిధి రమణ, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

బకాయి వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం, ఉప్పలగుప్తం

ఉపాదిహామీ చట్టంలో పని చేసిన కూలీల వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ముమ్మిడివరం మండలం అనాథపురం, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి, వెలసవిల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల ప్రాంతాల్లో కూలీలను కలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కోపం వచ్చినప్పుడల్లా ఉపాధి పథకాన్ని ఎత్తి వేస్తామని అంటున్నాడని, గ్రామాల్లో ఉన్న పెత్తందారులు కూడ అదేమాట అంటున్నారని అన్నారు. ఎట్టి పరిస్థితిలో ఈ పథకం రద్దు అవ్వకుండా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ పథకాన్ని కాపాడు కుంటేనే కార్మికులకు ఎంతో కొంత మేలు జరుగుతుందని గుర్తుంచుకోవాలన్నారు. ఉపాధి కార్మికులకు పనిదినాలు 200 రోజులకు పెంచాలని, కూలి ధరను రూ.600 చేయాలని, గతంలో మాదిరిగా ఫే స్లిప్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఇన్సూరెన్స్ రూ 5లక్షలు ఇవ్వాలని అన్నారు. పని ప్రాంతంలో ప్రాథమిక వైద్యానికి సంబంధించిన కిట్లు అందుబాటులో ఉంచాలని, పని ప్రాంతంలో టెంట్లు వేయాలని, పనులు చేపట్టేందుకు గునపం, పారా వంటి పని ముట్లు అందించాలని డిమాండ్ చేశారు కూలి పని నిబంధనల ప్రకారం పూర్తియినా మధ్యాహ్నం 12 గంటల వరకూ పని ప్రాంతంలోనే ఉండాలని అధికారులు ఆదేశించడం సరికాదని, 11 గంటలకే రెండవ మస్తరు వేసి కూలీలను పంపించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన ప్రకారం కూలీలు అందరికి ఆరు నెలల పాటు రూ.6 వేలు పింఛన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్‌కు ఇరువైపులా, చెరువు గట్లపై ఉన్న కొబ్బరి చెట్లును పేదలకు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇసుపట్ల మంగాదేవి, నాయకులు బీర వెంకట్రావు, సత్యనారాయణ, నరసింహమూర్తి, ఆనందరావు, వరలక్ష్మి, శారద, నరసింక మూర్తి, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి : కమిషనర్



ఆలయ అభివృద్ధిపై సమీక్షిస్తున్న కమిషనర్, ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ అన్నారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన డిసి నల్లం సూర్య చక్రధరావు, ఇంజనీరింగ్ బృందంతో యాత్రికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పార్కింగ్, ఆలయ మాడ వీధులు, శ్రీనివాస ప్రాంగణం, కోనేరు పనులు పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు తో ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి శనివారం 70 వేలకు పైబడి యాత్రికులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నారని అన్నారు. యాత్రికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి మాస్టర్ ప్లాన్ తయారు చేసినట్టు తెలిపారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. యాత్రికులు విశ్రాంతి తీసుకునేందుకు డార్మెంటరీ ఏర్పాటు చేసి 50 పడకగదులు నిర్మిస్తామన్నారు. ఈ పనులు చేసేందుకు వారం రోజుల్లో టెండర్లు పిలుస్తామని తెలిపారు. ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడుతూ యాత్రికుల సౌకర్యార్థం రూ.1.30 కోట్లతో డార్మెంటరీ, అన్నదాన భవన నిర్మాణ పనులు పున్ణప్రారంభిస్తామన్నారు. యాత్రికుల రద్దీ కనుగుణంగా కంపార్ట్మెంట్లు నిర్మించి యాత్రికులు విశ్రాంతి తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. యాత్రికులు సౌకర్యార్థం స్థల సేకరణ చేస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాడపల్లి ఆలయ అభివృద్ధి గురించి క్యాబినెట్లో చర్చించారని ఆయన గుర్తు చేశారు. ఎస్‌సి పేట నుంచి ఊబలంక వరకు ఏటి గట్టును అభివృద్ధి చేస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలను స్వీకరిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ళ

ప్రజాశక్తి - మండపేట

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత అంశాలపైన, డ్రైయిన్స్, రీ సర్వేలో ఇబ్బందులు, వివిధ సమస్యలపై, సంబంధిత అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలపై పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కట్టుంగ గ్రామంలో గోదావరి మధ్య డెల్టా పరిధిలోని గన్నవరం కాలువ వద్ద గల ఆర్ఎస్ఎస్ ఛానల్ పై రూ.10 లక్షలతో పున్ణనిర్మించనున్న డిపి ఇల్లెట్ నిర్మాణానికి కోనసీమ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహారావుతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో రైతు సమస్యలను పట్టించుకోకపోవడంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి పెద్ద పేట వేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి పట్ల విశ్వాసం పెంచాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వరప్రసాద్

ప్రజాశక్తి - రాజోలు

ప్రభుత్వాసుపత్రుల్లో అందిస్తున్న సేవలపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలని ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ సూచించారు. శుక్రవారం రాజోలు ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందజేసే వైద్య సేవల్లో మెరుగైన చికిత్స విధానాలు, మౌలిక సదుపా యాల కల్పన పరిస్థితుల్లో మార్పులు రావడానికి కూటమి ప్రభుత్వం పని చేస్తోంద న్నారు. వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, వైద్య సేవలు అందించేవారు పరిమితులకు లోబడి పని చేయా ల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో లోటుపాట్లను అధిగమిం చేందుకు వైద్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా మన బాధ్యతలను మనం నిర్వర్తించాల్సి ఉందని తెలిపారు. ఆసుపత్రిలో గైనాకాలజిస్ట్, పిల్లల వైద్యుల కొరత ఉందని ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై డిసిహెచ్ఎస్‌కు ఫోన్ చేసి తక్షణమే రాజోలు ఆసుపత్రికి గైనిక్, పిల్లల వైద్యులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎన్‌సిసి అందించిన సిఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న భవనంపై అంతస్తు పనులను ఆయన పరిశీలించారు. డయాలసిస్ కేంద్రానికి జనరేటర్ సదుపాయం కల్పించాలని సూపరింటెండెంట్ ప్రశాంతి కోరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. డయాలసిస్ కేంద్రంలో మరో మూడు పడకలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దిరిశాల బాలాజీ, ముదునూరి చినబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, కాట్న రాజు, రేవు జ్యోతి, ఉలిశెట్టి అన్నపూర్ణ, అడబాల విజయ్, కోళ్ళ బాబి, నామన షణ్ముఖ్, బొమ్మిడి మహేష్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరులో ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత కార్యక్రమం జరిగింది. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ కళాజాతను పెదపళ్ల పిహెచ్‌సి వైద్యాధికారి డి.సాయికిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులు బుర్రకథ రూపంలో హెచ్ఐవి సోకకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిపి కౌన్సిలర్ నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, సిహెచ్ఒ ఎంఎస్ఎన్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి 'మహాలక్ష్మి' జాతర

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని పెదపట్నంలంక గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారి జాతర ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. జాతర మహోత్సవాల్లో భాగంగా దేవి సెంటర్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలతో, శక్తి వేషాలు, కోలాటం, తీన్మార్ విన్యాసాలు, బాణాసంచా కాల్పులతో అత్యంత వైభవంగా సేవ చేశారు. నెల 25 ఆదివారం రాత్రి అమ్మవారి జాతర, 26న అమ్మ వారి తీర్థం, నైవేద్యాలు చెల్లించే కార్యక్రమం, 27న సిరి బొమ్మ తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వహాక కమిటీ ప్రతినిధులు వెల్లడించారు.

శ్రీనవాసరావుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌గా కోన వెంకట శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన ముమ్మిడివరం ఫస్ట్ క్లాస్ జూనియర్ సివిల్ కోర్టులో ఎజిపిగా పని చేశారు. శ్రీనివాసరావు నియామకం పట్ల కోరసిక సత్తిబాబు, పళ్ళ వీరబాబు, వస్త్రాల వీరన్న, మట్ట సత్తిబాబు అభినందనలు తెలిపారు.

యోగాపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 21న నిర్వహించే యోగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా యోగాపై అవగాహన సదస్సును నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సదస్సులో ఎంపిడిఒ ఎ.రాజు మాట్లాడారు. మండలంలోని 18 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి.అప్పాజీ, ఎఒ మెహర్‌ప్రకాష్, ఎపిఎం ధనరాజు, ఎపిఒ అరుణకుమారి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుప్పలు తొలగించేలా చర్యలు



ప్రయివేటు భూమిలో పెరిగిపోయిన తుప్పలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక 12వ వార్డులోని పోతుల వారి వీధిలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, తుప్పలు తొలగించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. మంత్రమూర్తి అనే వ్యక్తికి చెందిన ఈ స్థలంలో రోడ్డు వెంబడి విపరీతంగా పిచ్చి మొక్కలు తుప్పలు, పెరిగిపోయాయి. ఈ విషయమై సంబంధిత స్థలం యజమానికి పలు దఫాలు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. పొదలలో రాత్రి సమయంలో పాములు, ఇతర విషపూరిత పురుగులు సంచరిస్తున్నాయి. పరిసర ప్రాంతాలకు చెందిన వారు రాత్రి సమయంలో బయటికి రావాలంటే భయపడుతున్నారు. ఈ ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలు, తుప్పలు తొలగించి వెంటనే చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు వార్డు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి




పిహెచ్‌సిలో రోగులకు మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీకర్

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతి ఒక్కరు ప్రభుత్వ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆర్‌డిఒ పి.శ్రీకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. మండల పరిధిలోని ఒఎన్‌జిసి రిగ్గులపై నో డ్రోన్ జోన్(రెడ్ జోన్) అమలులో ఉందని, కావున సంబంధిత ప్రాంతంలో నిబంధనలను ప్రజలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. నిబంధనలను అతిక్రమించే వారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెదపల్ల పిహెచ్‌సిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ వైద్యులు ప్రజలకు వచ్చే వ్యాధులపై సూక్ష్మ దృష్టితో పరిశీలించాలని సూచించారు. అలాగే ఆలమూరులో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం ద్వారా జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇన్‌ఛార్జ్ డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, డిటి సుబ్బరాజు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌బాబు, ఎపిఒ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



విద్యా వికాసానికి మార్గదర్శకం 'దీప్తి'



ప్రజాశక్తి - మామిడికుదురు

దీప్తి విద్యాసంస్థలు గ్రామీణ ప్రాంత విద్యా వికాసానికి మార్గదర్శకంగా నిలుస్తుందని కరస్పాండెంట్ డివివి.సత్యనారాయణ అన్నారు. విద్యాసంస్థలు సాధించిన ప్రగతి విజయాలను ఆయన ప్రజాశక్తికి వివరించారు. తమ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి ఒక చేతిలో డిగ్రీ మరొక చేతిలో జాబ్ అపాయింట్మెంట్ ఆర్డర్ పెట్టడమే లక్ష్యమన్నారు. దీప్తి డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.తేజస్వి(ములికిపల్లి) బిఎస్‌సి ఎంపిసి విభాగంలో 9.9 గ్రేడ్ పాయింట్లు సాధించి యూనివర్సిటీ ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. 5, 3 సెమిస్టర్లు పూర్తి చేసుకుని ఫైనల్ ఇయర్ విద్యార్థులు 39 మంది యావరేజ్ 9 గ్రేడ్ పాయింట్లు, సెకండ్ ఇయర్ విద్యార్థులు 32 మంది 9 గ్రేడ్ పైబడి పాయింట్లు దాటి సంచలన ఫలితాలు సాధించారన్నారు.

నాలుగేళ్లలో 190 మందికి ఉద్యోగాలు

రంగం ఏదైనా.. దీప్తి విద్యార్థిదే ఉద్యోగం లక్ష్యంతో తీర్చిదిద్దుతున్నామన్నారు. 2020 -24 మధ్యకాలంలో సాఫ్ట్‌వేర్‌లో 75, ఎలక్ట్రానిక్స్ 9, కామర్స్ 15, ఫార్మసీ 19, కెమికల్స్ ల్యాబ్ 20, ప్రయివేట్ బ్యాంకింగ్‌లో 30, ఫైనాన్స్‌లో 16, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 8 మంది మొత్తం 190 మంది తమ విద్యార్థులు ఉద్యోగాలలో స్థిరపడ్డారన్నారు. ఇంకా టిసిఎస్, విప్రో, ఇన్ఫోసిస్ లాంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు నిర్వహించిన రాత పరీక్షలు టెక్నికల్ రౌండ్, ఇంటర్వ్యూలు పూర్తి చేసుకుని మరో 22 మంది ఉద్యోగాలకు సెలెక్ట్ అయ్యి కాల్ లెటర్స్ కోసం వేసి చూస్తున్నారన్నారు.



కరస్పాండెంట్ సత్యనారాయణ

విద్యార్థుల ఆశా దీప్తి.. సాయి దీప్తి

అత్యుత్తమ ఫలితాల కోసం తాటిపాకలో.. సాయి దీప్తి ఐఐటి మెడికల్ అకాడమీ స్థాపించామన్నారు. 2024లో సిఎస్ఇ 51, ఇసిఇ 42, ఇఇఇ 27, ఐటి 22, మెకానికల్ 22, సివిల్ 11, ఇతర గ్రూపులు 31 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ వివిధ రంగాలలో 200 పైగా సీట్లు సాధించిన సంస్థ సాయి దీప్తి అన్నారు. జూనియర్ ఇంటర్‌లో 85 శాతం, సీనియర్ ఇంటర్లో 91 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. జూనియర్ ఇంటర్‌లో ఎం.హారిక చంద్ర ఎంపిసిలో 462/470, ఎం. జౌశ్య బైపిసిలో 404/440, కెజె.సుప్రియ సిఇసిలో 460/500 మార్కులు, సీనియర్ ఇంటర్‌లో సిహెచ్.గాయత్రి ఎంపిసి విభాగంలో 981/1000 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారన్నారు.



డి.గౌతమినవ్య, బిఎస్‌సి

ఎస్ఎస్‌సి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత

ఎస్ఎస్‌సి ఫలితాలలో 580 పైన మార్కులు ఇద్దరు, 570 పైన మార్కులు 10 మంది, 550 పైన మార్కులు 20 మంది, 500 పైన మార్కులు 48 మంది విద్యార్థులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. తద్వారా తమ విద్యా సంస్థలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

భవిష్యత్తు అంతా.. టెక్నాలజీ మయం.

దీప్తి డిగ్రీ కళాశాలలో ప్రపంచంలోనే పేరొందిన ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్, హర్వర్డ్ లాంటి యూనివర్సిటీలో ఉండే ఈ సరికొత్త కాంబినేషన్ బిఎస్‌సి గ్రూపుల విద్యార్థులకు పరిచయం చేసి విజయవంతంగా నడుపుతున్నామన్నారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా ఇక్కడ బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వివరించారు.



దీప్తి విద్యా సంస్థల భవనం



మొక్కలు నాటుతున్న కరస్పాండెంట్, విద్యార్థినులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని ఎర్రపోతవరం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య, భర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. రామచంద్రపురం పట్టణంలోని రాజు గారి కోట కాలనీకి చెందిన ఉందుర్తి సురేష్, భార్య స్నేహలతతో కలిసి యానం నుంచి రామచంద్రపురం స్వగ్రామానికి బయలుదేరి మార్గమధ్యలో ఎర్ర పోతవరం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భార్య, భర్తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేసి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి తరలించారు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

స్థానిక మెయిన్ రోడ్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అయినవిల్లి మండలం పోతుకూరు గ్రామానికి చెందిన సాగిరాజు నరసింహారాజు(54) మండల పరిధిలోని పల్లంకూరు శివారు లైట్ హౌస్ ప్రాంతంలో ఉన్న ఆనంద హేచరీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నరసింహారాజు బైకుపై పల్లంకూరు వైపు వెళుతుండగా పల్లం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో నరసింహారాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన 108లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు. ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్టు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల చేబ్రోలులో కిలాడి జ్యోతిపై ఆమె భర్త శ్రీను కత్తితో దాడి చేయగా ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులు కేసు కేసు నమోదు చేశారు. శుక్రవారం శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో స్థానిక హోటల్లో పని చేస్తూ వేడినీళ్ల మీదపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న పుడికోడి కష్ణన్ పద్మనాభన్ స్థానిక హోటల్‌లో పని చేస్తూ వేడినీరు దింపుతుండగా నీళ్ల కాలు మీద పడి గాయపడ్డాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు దీనిపై మృతుని సోదరుడు కృష్ణన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మోటార్లను దొంగిలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి- గోకవరం

మండలంలో రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలలో బ్యాటరీ లు, పొలాల్లో మోటార్ ఇంజిన్లను చోరీ చేస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 4 బ్యాటరీలు, 1 మోటార్ ఇంజన్‌ను రికవరీ చేశామని పోలీసులు తెలిపారు. పూర్తి దర్యాప్తు అనంతరం రిమాండ్‌కు తరలిస్తామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-తొండంగి

తొండంగి మండలం బెండపూడి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. గోపాలపట్నం గ్రామానికి చెందిన సాయి ఆనంద్ తమ తల్లిదండ్రులను బైకుపై కాకినాడ నుండి తన గ్రామానికి తీసుకొని వస్తుండగా బెండపూడి సమీపంలో జాతీయ రహదారిపై బైకు అదుపుతప్పి కింద పడిపోవడంతో బైకుపై ఉన్న తల్లి అమ్మాజీ అక్కడక్కకే మృతి చెందగా తండ్రి సూరిబాబు, ఆనంద్‌కు గాయాలైనట్లు చెప్పారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

బైకు చక్రానికి చీర చుట్టుకుని మహిళ మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలం పోలేకుర్రు పంచాయతీ జైభీమ్ పేట వద్ద జాతీయ రహదారి 216పై గురువారం జరిగిన ఒక ప్రమాదంలో మేడిశెట్టి పద్మ (44) అనే మహిళ మరణించింది. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ రూరల్ మండలం రామారెడ్డి నగర్‌కు చెందిన మేడిశెట్టి పద్మ, శ్రీనివాసరావు దంపతులు యానాం వైపు నుంచి కాకినాడ బైకుపై వెళుతుండగా జైభీమ్ పేట సమీపంలో పద్మ చీర బైకు చక్రంలో పడి చుట్టుకుపోయింది. దీంతో కింద పడిపోయి గాయపడిన ఆమెను కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కోరంగి పోలీసులు తెలిపారు.

గంజాయితో ఉన్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

గంజాయి కలిగివున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ సిహెచ్. విద్యాసాగర్ వెల్లడించిన వివరాల ప్రకారం... పెదపళ్ల గ్రామ శివారులో ఉన్న స్మశాన వాటిక దగ్గర శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గంజాయి కలిగిన వ్యక్తులు ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందితో దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. ఒక్కొక్కరి వద్ద 100 గ్రాముల చొప్పున గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరి నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు.

చినుకు పడితే చిత్తడే

అధ్వానంగా చింతకుంట చెరువు రోడ్డు

ప్రజాశక్తి - రామచంద్రపురం



చింతకుంట చెరువు రోడ్డు దుస్థితి

మండలంలోని పలు మారుమూల గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేక గ్రామస్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అందులో ముఖ్యమైనది చింతకుంట చెరువు, మట్లచెరువు, రావిచెరువు ప్రధాన రహదారి ఒకటి. వెంకటాయపాలెం నుంచి చింతగుంట చెరువు, రావిచెరువు, మట్లచెరువు గ్రామాలను కలిపే ఈ రహదారిని 2010లో నిర్మించారు. సుమారు 15 ఏళ్లుగా ఇది మరమ్మతులకు నోచుకోలేదు. ఈ మెయిన్ రోడ్డుపై నాలుగు గ్రామాలతో పాటు నెలపర్తిపాడు మామిడ గుంట, తదితర గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉంది. ఈ రహదారిలో చిన్నపాటి వర్షం పడినా గ్రామస్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రజలంతా ప్రతిరోజు ప్రధాన మార్కెట్ ద్రాక్షారామ మార్కెట్‌కి నిత్యవసర సరుకులకు రాకపోకలు సాగించడం పరిపాటి. ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తిగా పాడవడంతో మార్కెట్ కు కాదు కదా బయటకు వచ్చే పరిస్థితి లేదని, మోటర్ సైకిల్‌పై ఈ రోడ్డులో ప్రయాణించాలంటే దుమ్మి లేచిపోయి కళ్లు కన్పించని పరిస్థితులు నెలకున్నాయి. వర్షం వస్తే రోడ్డంతా చిత్తడిగా మారిపోతుంది. ఆ సమయంలో రోడ్డుపై ప్రయాణించేలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవా ల్సిందే. ద్విచక్రవాహనాలు జారిపోయి పలువురు ప్రమాదాల భారిన పడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం సైకిల్ మీద వెళ్లే పరిస్థితి లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి రోడ్డును ఆధునికీకరించాలని గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు సమిష్టి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి - అమలాపురం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌పి కృష్ణారావు

జిల్లాలో నేరాల నియంత్రణకు సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఎస్‌పి బి.కృష్ణారావు సూచించారు. సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.గజేంద్రకుమార్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడిన నాటి నుంచి క్రైమ్ విభాగానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్ లేకుండానే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ తరుణంలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.గజేంద్రకుమార్ ఆధ్వర్యంలో క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణకు సమిష్టిగా కృషి చేయాలని, సిబ్బంది మరింత మెరుగ్గా పనిచేయాలని అన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎవిఆర్‌పిబి.ప్రసాద్, డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్, ఎఆర్ డిఎస్‌పి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్, అమలాపురం పట్టణ సిఐ వీరబాబు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభతోనే ఉన్నత స్థానం సాధ్యం

ప్రజాశక్తి - ఆలమూరు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఒ గజలక్ష్మి

బాలలు విద్య పట్ల ఉత్తమ ప్రతిభను చాటుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత స్థానాన్ని సాధించగల్గుతారని సిడిపిఒ ఎ.గజలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని చెముడులంక పంచాయతీ కార్యాలయంలో 'బాలల హక్కులు -వాటి సంరక్షణ చట్టం'పై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర వికాసంలో భాగంగా విద్య హక్కు, ఓపెన్ స్కూల్ విధానంపై శిక్షణ ఇచ్చారు. కిశోర బాలికలు ఫోక్సో చట్టంపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలల మనుగడ, వారి సంరక్షణ, భాగస్వామ్యం, అభివృద్ధిని, సార్వత్రిక హక్కులను వివరించారు. అలాగే బాలలపై జరుగుతున్న అఘాయిత్యాలు, నిర్లక్ష్యాలను నిరోధించడానికి చర్యలు ఉంటాయన్నారు. అలాగే సరైన ఆశ్రయం లేని వారికి, పేదలకు, అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వం అండగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంఎస్‌కెలు బి.శాంతి, సాధన, సూపర్‌వైజర్ బి.వరలక్ష్మిదేవి, విఒఎలు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, ఎఎన్‌ఎంలు బి.మంగాదేవి, యు.జ్యోత్స్నారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు యు.సుశీల, కె.సూర్యకుమారి, జి.సత్యవతి, వి.రామలక్ష్మి, కె.జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో ఉచిత సేవలు

ప్రజాశక్తి - మామిడికుదురు



వైద్య సేవలందిస్తున్న యూనివర్శల్ లైఫ్ స్టైల్ వైద్యులు

మండలంలోని పెదపట్నంలంక గిడుగు వారి పాలెంలో హైదరాబాద్‌కు చెందిన యూనివర్సిల్ లైఫ్ స్టైల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఉచిత సేవలు అందించారు. శుక్రవారం నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్ ప్రారంభించారు. వైద్య నిపుణులు డాక్టర్ విమురళీధర్, కాదా లక్ష్మీ ఆధ్వర్యంలో కిడ్నీ, లివర్, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు శరీరంలో కీలకమైన గుండె, కిడ్నీల ఆరోగ్య సంరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొమ్ముల జంగమయ్య, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామప్రసాద్, గిడుగు వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లోడు ట్రాక్టర్ మినీవ్యాన్‌పై బోల్తా

ప్రజాశక్తి - ఆలమూరు



మినీ వ్యాన్ పై బోల్తా పడిన ధాన్యంలోడు ట్రాక్టర్

ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మినీ వ్యాన్‌పై బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని జొన్నాడ జాతీయ రహదారిపై రావులపాలెం వైపు నుంచి మడికి వైపుకు వెళ్తున్న ధాన్యం లోడు ట్రాక్టర్ జొన్నాడ ఫ్లైఓవర్ వద్ద మినీ వ్యాన్‌పై బోల్తా పడింది. ప్రమాదంలో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. సర్వీస్ రోడ్లును ఫ్లై ఓవర్ సిబ్బంది సరైన రీతిలో మరమ్మతులు చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షపు నీటితో మునిగిపోయాయి. రోడ్డుకి గుంతలు ఏర్పడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ధాన్యం మొత్తం రహదారిపై పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. హైవే, పోలీస్ సిబ్బంది సహకారంతో ట్రాఫిక్‌ను నియంత్రించి, సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ పనులు పూర్తిచేసి ప్రతిరోజు జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామదర్శిని ద్వారా సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామ దర్శిని కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాధపురం, కరిచర్లగూడెం, గోపాలపురం, కోమటికుంట, వాదాలకుంట, గుడ్డిగూడెం, సంజీవపురం, కరగపాడు గ్రామాల్లో నిర్వహించిన గ్రామదర్శినిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో గోపాలపురం ఎంతో వెనకబడి ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గోపాలపురంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామదర్శిని ద్వారా ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించి, అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల రోజులు యోగా సాధన కార్యక్రమాలు

ప్రజాశక్తి - అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులపాటు యోగా సాధన కార్యక్రమాలను నిర్వహిస్తుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. యోగ అభ్యసన, శిక్షణ కార్యక్రమాల విధి విధానాలపై సమీక్షించారు. సంబంధిత అధికారులకు చేయాల్సిన విధులు, బాధ్యతలను కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నెల రోజులపాటు యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యచరణను రూపొందించినట్లు తెలిపారు. జూన్ 21న రికార్డు స్థాయిలో యోగా చేయించాలనే లక్ష్యంతో ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8 మధ్య యోగా సాధన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలలోనూ, ప్రముఖ దేవాలయాలలోనూ యోగ కార్యక్రమాలు నిర్వహించాలని పర్యాటక దేవాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయుష్ విభాగం యోగా శిక్షణ కార్యక్రమాలలో యోగా గురువులు, మాస్టర్ ట్రైనీలు ద్వారా వివిధ దశలలో ఐదేసి రోజులు పాటు శిక్షణలను ఇప్పించాలన్నారు. ఈనెల. 27న మాస్ మీడియాకు యోగాతో అనారోగ్యాన్ని జయించిన, యోగా సాయంతో విజయ తీరాలకు చేరిన కథనాలు విడుదల చేయాలని, అదే రోజు మాస్ ర్యాలీని అధికారులు ప్రజాప్రతినిధులతో నిర్వహించాలన్నారు. ఈనెల 27, జూన్ 3, జూన్ 16 యోగాంధ్రపై క్యాంపెయిన్ పర్యాటకుల ద్వారా చేప ట్టాలన్నారు. ఈనెల 28 మండల స్థాయిలో ర్యాలీలు నిర్వహించాలన్నారు. జూన్ 2న రంగోలి పోటీలు, జూన్ 4న గ్రామ, మున్సిపల్ స్థాయిల్లో కార్యక్రమాలు, జూన్ 5 నుంచి 7 వరకూ స్వయం సహాయ సంఘాలతో, జూన్ 13న రైతుల యోగ, జూన్16న ఫ్యామిలీ యోగ, జూన్ 17న స్పెషల్ యోగ వరుసగా జూన్ 21 వరకు వివిధ యోగా కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత శాఖల అధి కారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ రాజకుమారి, సిపిఒ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ మధుసూదన్, ఆయుష్ మెడికల్ అధికారి విజయ్‌కుమారి, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, డిఐపిఆర్ఒ కె. లక్ష్మీనారాయణ, డిఇఒ షేక్ సలీం భాష, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యమ్నాయం బిఎస్‌పియే

ప్రజాశక్తి - అమలాపురం రూరల్



సభలో మాట్లాడుతున్న బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు గౌతంకుమార్

రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన పార్టీలకు ప్రత్యామ్నయం బహుజన సమాజ్ పార్టీయేనని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతంకుమార్ అన్నారు. శుక్రవారం ఈదరపల్లిలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో బహుజన సంకల్ప సభ జరిగింది. బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను అమ్మి ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఈ విషయం తెలిసి చంద్రబాబు ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలను ఇప్పటివరకు సంకీర్ణ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు భూమి పంపిణీ చేయకుండా తాత్కాలిక పథకాలతో మభ్యపెడుతూ పేదరికంలోనే ఉంచుతున్నారని, బిఎస్‌పి అధికారంలోకి వస్తే పేద ప్రజలకు భూమి పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, గెద్దం సంపత్‌రావు, అశోక్, ఉమ్మడి జిల్లాల ఇసి మెంబర్ బత్తుల లక్ష్మణరావు, జిల్లా ఇన్‌ఛార్జ్ కె.లక్ష్మీభవాని, ఉపాధ్యక్షులు వాకపల్లి భీమారావు, కార్యదర్శి జాన్ మోసే, అమలాపురం ఇన్‌ఛార్జ్ పొలమూరి మోహన బాబు, నియోజకవర్గాల అధ్యక్షులు ఆకుమర్తి భూషణం, బడుగు భీమేశ్వరరావు, తాడి రాంబాబు, జి.కొత్తయ్య, నాయకులు జుత్తుగా సత్యనారాయణ, రమణ, పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పశువుల దాణా

ప్రజాశక్తి - ఆలమూరు



దాణా విక్రయాన్ని ప్రారంభిస్తున్న వెంకటరత్నం

పాడి రైతులకు రాయితీపై ఇస్తున్న పశు దాణాను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకట్రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని 18 గ్రామాల ఆర్‌ఎస్‌కెలు, పశు వైద్యశాలల వద్ద 24.50 టన్నుల పశువుల దాణాను పశు సంవర్ధక శాఖ ఎడి ఎల్.అనిత ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై విక్రయాలు చేపట్టారు. ఈ సందర్భంగా జొన్నాడలో జరిగిన కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాడి రైతుల ఆర్థిక పురోభివృద్ధి కోసం రాయితీపై పశు దాణా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి 50 కేజీల బస్తా అసలు ధర రూ.1110 కాగా, రాయితీపై రూ.555కే విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పాడి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత నాగిరెడ్డి వెంకటరత్నం, వెటర్నరీ వైద్యులు భానుప్రసాదరావు, వినోద్‌కుమార్, కూటమి నాయకులు కొత్తపల్లి రాంబాబు, శిరంగుల సతీష్, గుండుమల్ల రాంబాబు, పామర్తి పేర్రాజు, పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు

మండలంలోని కోరుమిల్లి గ్రామంలో సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సదస్సుకు గ్రామ సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ పి.రాంబాబు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా కోరుమిల్లి గ్రామంలో ఒక్క సారా కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. గ్రామ కార్యదర్శి, సర్పంచ్, ఎంపిటిసి, స్థానిక మహిళా పోలీస్, విఆర్‌ఒలతో కూడిన సారా నిర్మూలన కమిటీ సహకారంతో కోరుమిల్లి గ్రామం సంపూర్ణ సారా రహిత గ్రామంగా నమోదయిందన్నారు. గ్రామ కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ కోరుమిల్లి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సుంకర వెంకటేశ్వరరావు, కార్యదర్శి కామేశ్వరరావు, మహిళా పోలీస్ బి.రామతులసి, వార్డు సభ్యుడు వెలుగుబంటి ఏసుదాసు, అంగన్‌వాడీ కార్యకర్తలు డ్వాక్రా యానిమేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించే వరకూ దీక్ష

ప్రజాశక్తి - మండపేట



రిలే నిరహార దీక్ష చేస్తున్న శ్రీవాణి

మండలంలోని కేశవరం జడ్‌పి ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించేంత వరకూ తన రిలే నిరహార దీక్ష కొనసాగుతుందని సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి అన్నారు. హైస్కూల్‌కు ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆమె చేపట్టిన రిలే నిరహారదీక్ష శుక్రవారానికి 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న సీనియర్ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల పేరెంట్స్ గ్రామ ప్రజలు, నాయకులు, తరలి వచ్చి పాఠశాల సమస్యను ప్రతి ఒక్కరు సంబంధిత అధికారులకు తెలియజేయాలని శ్రీవాణి కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఈ రిలే దీక్ష కొనసాగుతుందన్నారు.

సైన్యానికి మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారత సైన్యానికి మద్దతుగా మండలంలోని హసన్ బాద గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో జరిగినఈ ర్యాలీలో గ్రామస్తులు పాల్గొన్నారు. భారత త్రిదళాల సైన్య పోరాట స్ఫూర్తిని అభినందిస్తూ ఈ ర్యాలీ నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు. సైన్యానికి అందరూ మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు చింతపల్లి వీరభద్రరావు, దొంతంశెట్టి ఓంప్రకాష్, చింతపల్లి సతీష్, కార్యదర్శి కాశీ రాకేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.